# శిష్లాలయ్యాలక్షుప్పూజారుఖ


డాక్టర్ ద్వానాశాస్త్రి


అది ఆడపెళ్ళివారిల్లు.

'పై సంపాదన'తో, 'కాకా'లతో హోదా సంపాదించిన వాడు కాదు – ఆ ఇంటి యజమాని.

అధికారుల నిర్దయ, 'దక్షిణ'ల సమర్పణ, సహచరుల వెక్కిరింతలకు తోడుగా 'సత్తెకాలపు సత్తెయ్య' బిరుదుతో జీవిత శకటాన్ని లాగుతున్న ఓ మధ్యతరగతి జీవి ఆయన! మరో సంవత్సరంలో రిటైరైపోతూ తన ఆఖరి కూతురు కామాక్షి పెళ్ళి చేస్తున్నాడు ఆనందరావు.

కేవలం పదివేల రూపాయల కట్నంతో సంబంధం ఖాయం కావటంతో ఆనందరావు దంపతులు "దేవుడున్నాడోయ్" అనుకుంటూ తెగ సంబరపడిపోయారు. లోకంలో ఇంకా మంచితనం చావలేదనే సిద్ధాంతానికి కూడా వచ్చేశారు.

పెళ్ళి పందిరి మహా కోలాహలంగా వుంది.

ఆ సమయంలో ఆనందరావుకి పిల్ల పెళ్ళి కోసం చేసిన అప్పులు కానీ – ఆ అప్పులపై వడ్డీల గురించిన తలపులు కానీ గుర్తురావటం లేదు – 'తన కూతురు రేపీపాటికి ఓ ఇంటిదవుతుంది. తన బరువు బాధ్యతలు తీరిపోతాయి. ఉద్యోగంలో వుండగానే పెళ్ళి చేశాడన్న కితాబూ దక్కుతుంది' అనుకుంటూ ఆనందరావు 'సార్థకనామధేయుడై' హడావిడిగా తిరిగేస్తున్నాడు.

గౌరీపూజ కూడా అయిపోయింది.

ఇంకా మగపెళ్ళివారు రావాలి.

ఆనందరావు సింహద్వారం దగ్గిర నుంచొని మగపెళ్ళివారి రాక కోసం కనురెప్ప వెయ్యకుండా చూస్తున్నాడు.

"అయ్యా, ఆనందరావుగారూ, కాలాతీతం అవుతోందండీ. ఇంకా జరగాల్సిన తంతు చాలా వుంది. ఇదేమీ మీటింగు కాదుకదా ఎప్పుడుపడితే అప్పుడు ప్రారంభించడానికి" అని హెచ్చరిస్తున్నాడు పురోహితుడు.

"ఈసరికి రావల్సిందేనండీ, బస్సు లేటయిందేమో" అంటూ ఆనందరావు బస్టాండుకి వెళ్ళిరమ్మని ఎవర్నో పురమాయించాడు.

మరికొంతసేపు గడిచింది.

మగపెళ్ళివారింకా రాలేదు.

ఆనందరావుకి బి.పి. పెరుగుతోంది.

"ఏవండీ, ముహూర్తం దగ్గరపడుతోంది..." మెల్లగా ఆదుర్దాగా నసిగింది ఆనందరావు భార్య.

"వస్తారులే... ఏ అవాంతరం వచ్చిందో..."

"అది కాదండీ... నా మనసు శంకిస్తోందండీ"

"పిచ్చిదానా... అధైర్యపడకు. అంతగా అయితే రేపు రాత్రి కూడా దివ్యమైన ముహూర్తం వుందిట. దానికైనా శుభకార్యం జరిగిపోతుంది గదా" అంటున్నాడుగానీ – ఆనందరావు గుండె కూడా వేగంగానే కొట్టుకుంటోంది.

'అయినా జాతకాలు సలక్షణంగా వున్నాయి. పైగా సుబ్బావధాన్లుగారి ముహూర్తమంటే తప్పటానికి వీల్లేదు' – అని మనసుని జోకొడుతున్నాడు.

ఆనందరావు భార్య అనుకున్నది అనుకున్నట్టు అయితే అప్పనవిల్లి వెంకన్నబాబుకి తలనీలాలిస్తానంది. మందపల్లి శనేశ్వరుడ్ని దర్శిస్తానంది. శివుడికి రుద్రాభిషేకం, ఆంజనేయుడికి తమలపాకుల పూజ చేయిస్తానంది. ఇప్పటిదుంటున్న శని, ఆది వారాలు కాక శుక్రవారం కూడా వుంటానని మొక్కుకుంది.

అయినా మగపెళ్ళివారింకా రాలేదు.

'గడియారం వెనక్కి తిరక్కూడదూ' అని ఆనందరావు భార్య ఆవేదనపడుతూంటే

'కాలం ఆగిపోకూడదూ' అని ఆశపడుతున్నాడు ఆనందరావు.

పడక్కుర్చీలో కూర్చున్న ఆనందరావులో ఆనందం మాయమవుతోంది. ఏదో దిగులు నరనరాన వ్యాపిస్తోంది. మనసు కీడునే శంకిస్తోంది.

పందిట్లో చిన్నపిల్లలు మాత్రం మహానందంగా ఆడుకొంటున్నారు.

"ఆనందరావుగారెవరండీ?" స్కూటరు మీద వచ్చిన యువకుడు పెళ్ళి పందిట్లోకి వస్తూ అడిగాడు.

"ఏం బాబూ, నేనే ఆనందరావుని" నూతిలో గొంతుకలా వుంది.

"మగపెళ్ళివారు పంపారండి... మీకీ ఉత్తరం ఇచ్చిరమ్మన్నారు..." అని ఉత్తరం ఆనందరావు చేతిలో పెట్టి స్కూటరెక్కేశాడు.

పెళ్ళిపందిరంతా నిశ్శబ్దమైపోయింది. ఒక్కసారి చిత్రపటమైపోయింది.

ఆనందరావు భయం భయంగా ఆ ఉత్తరం చదవసాగాడు...

"ఆనందరావుగార్కి – నమస్కారం. మనం వియ్యంకులమవ్వే అదృష్టం లేదు. ఎంతగా కావాలనుకున్నా 'విధి' మనకి సానుకూలంగా లేదు. మనం తాంబూలాలు పుచ్చుకున్న మర్నాడే నాకు హార్ట్ ఎటాక్ వచ్చింది. మావాళ్ళు 'ఇది అపశకునమండీ' అని అన్నా నేను మూఢ నమ్మకంగా కొట్టిపారేశాను. మీ అమ్మాయికి హిస్టీరియా వుందంటూ నాకో ఆకాశరామన్న ఉత్తరం వచ్చినా నేను నమ్మలేదు. కానీ... ఇవ్వాళ మేం పెళ్ళికి వస్తూండగా దారిలో యాక్సిడెంట్ అయింది. పెళ్ళికొడుక్కి గాయాలు తగిలాయి – పెద్ద ప్రమాదం తప్పింది. 'పెళ్ళయితే ఏమవుతుందో...' అనే భయం అందర్నీ ఆవహించింది. అపశకునాల్ని నమ్మని నేను అనుభవంతో నమ్మవలసి వస్తోంది. ఒక ఆడపిల్ల తండ్రిగా మీ బాధను సానుభూతితో అర్థంచేసుకోగలను కానీ – మావాడి భవిష్యత్తును స్వయంగా పాడుచేసే హక్కు నాకు లేదు గదా! అందుకే మీ అమ్మాయి మాకు కోడలయ్యే అవకాశం లేదని తెల్పటానికి విచారిస్తున్నాను. క్షమించగలరు"

ఆనందరావు కుప్పలా కూలిపోయాడు.

"ఏమైందండీ" అని భార్య బావురుమంటోంది.

"నాన్నా" అని కామాక్షి స్పృహ కోల్పోయింది.

ఆనందరావు కొడుక్కి మాత్రం "దేవుడా రక్షించు నా దేశాన్ని..." అన్న తిలక్ కవిత గుర్తొచ్చింది!



## కన్నె కళ్ళు

అందరూ
వయసొచ్చిందన్నప్పుడు
ఆనందంతో విరిసీ విరియని కలువలు!

పెద్దలంతా పెళ్ళిచూపులప్పుడు
సిగ్గుతో
మేఘాలచాటున మెరిసే తారకలు!!

కట్నాల బేరం కుదరక
కళ్యాణమాగిపోయినపుడు
కసితో
కణకణమండే రెండు రవిబింబాలు

– ఉప్పల అప్పలరాజు
*Visakhapattanam, AP*